# రెండో రోజు ఒకే నామినేషన్ దాఖలు

- మెదక్‌లో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ దాఖలు
- నర్సాపూర్‌లో బోణీ కాలే..

మెదక్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఎన్నికల పర్వంలో రెండో రోజు శనివారం మెదక్‌లో ఒకే ఒక నామినేషన్ దాఖలైంది. హవేళీఘనపూర్ మండలం కూచన్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డమీది నాగరాజుగౌడ్ స్వతంత్ర అభ్యర్థిగా శనివారం నామినేషన్ దాఖలుచేశారు. తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి అంబాదాస్ రాజేశ్వర్‌కు అందజేశారు. నర్సాపూర్ నియోజకవర్గంలో రెండో రోజూ ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

### కేంద్రానికి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలు

నామినేషన్ కేంద్రం వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. కేంద్రానికి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలుచేశారు. ఇతరులను లోపలికి అనుమతించడంలేదు. నామినేషన్ల ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద 144 సెక్షన్ అమలుచేశారు. వంద మీటర్ల వరకు బారికేడ్లతో పాటు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటుచేశారు. కఠిన ఆంక్షలు అమలుచేశారు. కేవలం నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులను మాత్రమే అనుమతించారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా రిటర్నింగ్ అధికారి సమయం వరకు నామినేషన్ల స్వీకరణకు అనుమతించారు.

### 10 వరకు బీఫారాలు అందజేయాలి: రిటర్నింగ్ అధికారి అంబాదాస్ రాజేశ్వర్

నామినేషన్‌లు దాఖలు చేసే ప్రధాన పార్టీ అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ వరకు పార్టీ బీఫాంలను అందజేయవచ్చని, మెదక్‌లో రెండో రోజు శనివారం ఒకే ఒక స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అంబాదాస్ రాజేశ్వర్ తెలిపారు. ఒక అభ్యర్థి అసెంబ్లీ ఎన్నికల ఖర్చు రూ.40 లక్షలకు మించకుండా ఖర్చు చేయాలని ఆయన సూచించారు. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్ల పర్వం కొనసాగుతుందన్నారు. నామినేషన్లు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.



గీతాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## కచ్చితంగా ఓటేద్దాం...!

మెదక్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లా ప్రజలకు ఓటు విలువ తెలిసేలా కలెక్టర్ రాజర్షి షా విడుదల జేసిన కచ్చితంగా ఓటు వేద్దాం చైతన్యగీతం ప్రజలను ఆలోచింపజేస్తున్నది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తయారు చేసిన ఈ గీతం సినీ గీత రచయిత సాయిసిరి రాయగా, సంగీత దర్శకుడు నందన్ స్వరపరిచారు. ప్రజలకు ఓటు విలువను తెలియజేస్తూ ఊరూరా తిరుగుతున్న ఎన్నికల చైతన్య రథంపై మోగుతున్న ఈ గీతం అర్థవంతంగా ఉండడంతో ప్రజాదరణ లభిస్తున్నది. వంద ఉపన్యాసాల కన్నా ఒక్క పాట మిన్న అన్నట్లు ప్రతిఒక్కరినీ ఆకట్టుకుంటున్న ఈ పాటను మెదక్ జిల్లాకు చెందిన సినీ గీతరచయిత, ఉపాధ్యాయుడు సాయిసిరి రాయడం విశేషం.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి




సమావేశంలో మాట్లాడుతూన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్‌చంద్

మెదక్ అర్బన్, నవంబర్ 4: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రీటాలాల్‌చంద్ అన్నారు. శనివారం హవేళీఘనపూర్ పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పిల్లల కోసం రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులు కల్పించారన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిద్దాగౌడ్, సిద్దిరాములు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి ఎంపికైన విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న విద్యాధికారి రాధాకిషన్

## రాష్ట్రస్థాయిలో నాలుగు ప్రాజెక్టులు ఎంపిక

- మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 4: రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు జిల్లా నుంచి నాలుగు ప్రాజెక్టులు ఎంపికైనట్లు మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ వెల్లడించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో 55 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఇందులో ఉత్తమమైన నాలుగు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. ఇదే స్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని డీఈవో ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, సైన్స్ అకాడమిక్ కో ఆర్డినేటర్ ప్రభు, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేఖ, గైడ్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల విద్యార్థులు

రక్షక్, పదో తరగతి, జడ్పీహెచ్ఎస్ పొడ్చాన్‌పల్లి, వాగ్దేవి, పదో తరగతి, గీతా హైస్కూల్ మెదక్, అబ్దుల్ హమీద్, పదో తరగతి, సిద్దార్థ్ రూరల్ హైస్కూల్ మాచవరం, శివసాయి గణేశ్, 8వ తరగతి, గీతా హైస్కూల్ తూప్రాన్, ప్రోత్సాహక బహుమతులు సాధించిన విద్యార్థులు శ్రీహర్షిణి పదో తరగతి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మెదక్, నితన్యశ్రీ, పదో తరగతి టీఎస్‌ఆర్ఎస్ (బాలికలు) మెదక్.



నర్సాపూర్‌లోని ఆర్వో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా

## కౌంటింగ్ సెంటర్లలో అన్ని ఏర్పాట్లు చేయాలి

- మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

మెదక్ అర్బన్, నవంబర్ 4: కౌంటింగ్ సెంటర్లలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులకు ఆదేశించారు. శనివారం సాధారణ ఎన్నికలు 2023లో భాగంగా స్థానిక వైపీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మెదక్ 34, నర్సాపూర్ 37 నియోజకవర్గాల్లో కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను ఎస్పీ రోహిణి ప్రియదర్శినితో కలిసి జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ కౌంటింగ్ రోజు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటర్‌నెట్, మీడియా పాయింట్, బారికేడ్లు, విద్యుత్ సరఫరా, తాగునీరు లాంటి ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టర్‌తో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్, మెదక్, హవేళీఘనపూర్ తహసీల్దార్లు శ్రీనివాస్, నారాయణ, ఆర్‌అండ్‌బి అధికారి సర్దార్‌సింగ్, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఆర్వో కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

నర్సాపూర్, నవంబర్ 4: నర్సాపూర్ నియోజకవర్గంలోని ఆర్వో కార్యాలయాన్ని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా శనివారం సందర్శించారు. ఆర్వో కార్యాలయంలో ఉన్న వసతులు, సదుపాయాలు, నామినేషన్ వేసే అభ్యర్థుల వివరాలు నమోదు చేసే రికార్డులను పరిశీలించారు. అభ్యర్థి నామినేషన్ వేసే సమయంలో అధికారులు జాగ్రత్తగా పత్రాలను సరి చూడాలని అధికారులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈసీఐ మార్గదర్శకాలు, నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు సమర్పించే నామినేషన్ పత్రాలను తప్పులు లేకుండా చెక్ లిస్ట్ ఆధారంగా సరిచూసుకోవాలన్నారు. కలెక్టర్‌తో ఆర్వో శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## అల్పాహారంతో శారీరక ఎదుగుదల

- డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ (డీజీఈ) కృష్ణారావు

నర్సాపూర్, నవంబర్ 4: విద్యార్థులకు అల్పాహారం ఉపయోగకరమని డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ (డీజీఈ) కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని ఆవంచ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం నర్సాపూర్ మున్సిపాలిటీలోని జగన్నాథరావు కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల, రోషిణి ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్పాహారంతో విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలకు వస్తారన్నారు. తొలిమెట్టులో భాగంగా విద్యార్థులను చదివించడం, రాయించడం చేయాలన్నారు. విద్యార్థులు చక్కగా చదువుతున్నారని, వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఆయనతోపాటు ఎంఈవో బుచ్చానాయక్, హెచ్ఎం ధన్‌సింగ్, సరితా, అబ్దుల్, సీఆర్‌పీ భైరవ్‌రెడ్డి, విశ్వకాంత్ ఉన్నారు.

## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక



సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న ఖాజీపేట్ గ్రామం రాంసింగ్‌తండా కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్, నవంబర్ 4: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మండలంలోని ఖాజీపేట్ గ్రామ పంచాయతీ రాంసింగ్ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో శనివారం చేరారు. వారికి సునీతారెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాంసింగ్‌తండాకు చెందిన శేఖర్, తుక్యా, భీమ్లా, కిషన్, మురళీ, మంగ్య, రాజు, రాందాస్, నరేశ్, ఓంకార్, సుమన్, గోపాల్, కళ్యాణ్, భాస్కర్, శ్రీను, హిర్యా, హిమ్లు, రాజు, రమేశ్, విఠల్, బబ్లు తదితరులు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఖాజీపేట్ బీఆర్ఎస్ నాయకుడు సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లలితా నర్సింగ్, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ వెంకట నర్సింగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

★ CIVIL Site Engineer with Experience 5 years. Job Location: Chanda Nagar. Contact: +91 9912990546.
NT-322737

★ *హైదరాబాద్* నందు వృద్ధులను *వారి ఇంట్లోనే ఉండి* చూసుకోవడానికి వర్కర్స్ కావలెను. ఉచిత వసతి, భోజనం. జీ: 15-25 వేలు, ఏజెంట్ కమీషన్: 3-5 వేలు, M/F, 20-50 సం||లు. *హేమ హోమ్ హెల్త్‌కేర్*-7330746999.
NT-320244-All

KIDNEY STONES

★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం. 47 సం||, అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. Ph: 9866007924, 9550336677, 040-27000580.
NT-320707

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.